## అటు గ్రూప్-2 పరీక్షలు.. ఇటు ఆర్ఆర్‌బీ

- ఒకే రోజు పరీక్షలుండటంతో సందిగ్ధంలో అభ్యర్థులు
- గ్రూప్-2 పరీక్షలను వాయిదా వేయాలంటూ డిమాండ్లు

హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): గ్రూప్-2 పరీక్షల సమయంలోనే రైల్వే రిక్రూట్‌మెంట్‌బోర్డు(ఆర్ఆర్‌బీ) పరీక్షలున్నాయి. ఒకే రోజు రెండు పరీక్షలుండటంతో ఏ పరీక్ష రాయలో తెలియక అభ్యర్థులు సతమతమవుతున్నారు. ఒక పరీక్ష కోసం మరో పరీక్షను వదులుకోవాల్సి ఉండటంతో కలవరపడుతున్నారు. గ్రూప్-2 పరీక్షలు డిసెంబర్ 15, 16న జరగనున్నాయి. ఆర్ఆర్‌బీ జూనియర్ ఇంజినీర్, టెక్నీషియన్ పోస్టుల భర్తీకి డిసెంబర్ 16, 17, 18న పరీక్షలు జరగనున్నాయి. గ్రూప్-2కు హాజరయ్యే వారిలో కొందరు ఆర్ఆర్‌బీ పరీక్షలకు దరఖాస్తు చేశారు. దీంతో తమకు నష్టం కలుగుతుందని విద్యార్థులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఆర్ఆర్‌బీ పరీక్షలను దేశవ్యాప్తంగా నిర్వహిస్తుండటంతో వాయిదావేయడం అసాధ్యం. దీంతో గ్రూప్-2 పరీక్షలను వాయిదావేయాలని అభ్యర్థులు కోరుతున్నారు. ఏనిమిదేండ్ల తర్వాత జూనియర్ ఇంజినీర్ పోస్టుల భర్తీకి ఆర్ఆర్‌బీ నోటిఫికేషన్ విడుదలైందని, గ్రూప్-2 కూడా ఎన్నో ఏండ్ల తర్వాత విడుదలైందన్నారు.

## 'గ్రూప్-4' వెరిఫికేషన్ పొడిగింపు

హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ) : మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన గ్రూప్-4 అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు 289 మంది హాజరుకాలేదు. 2,217 మందికి 1,928 మంది మాత్రమే హాజరయ్యారు. వెరిఫికేషన్‌కు మరికొన్ని రోజులు గడువు పొడిగించారు.

## 13 నర్సింగ్ కాలేజీలు మంజూరు

హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): 13 జిల్లాలకు నర్సింగ్ కాలేజీలను ప్రభుత్వం మంజూరు చేసింది. జనగామ, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, రామగుండం(మంచిర్యాల), మెదక్, కుత్బుల్లాపూర్(మేడ్చల్ మల్కాజిగిరి), ములుగు, నారాయణపేట, మహేశ్వరం(రంగారెడ్డి), నర్సంపేట(వరంగల్), యాదాద్రి భువనగిరిలోని మెడికల్ కాలేజీలకు అనుబంధంగా వీటిని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపింది.


























